# సాంబ రహస్యం



— వి.పి.బి. నాయర్
స్పెషల్ ఐ.జి. ఆఫ్ పోలీస్

ఆటో దిగిన సుబ్రహ్మణ్యం తలెత్తి చార్‌మినార్ వైపు చూశాడు.

ఆహా ఎంత గొప్ప కట్టడం! ఆశ్చర్యపోయాడు.

ఆ తరువాత జేబులోని చిన్ని కాగితాన్ని తీసి తాను వెళ్లాల్సిన షాప్ అడ్రసుకు బయల్దేరాడు.

దూరాన ఎక్కడి నుంచో మసీదు నుంచి ప్రార్థన చేయడానికి సమయం అయినట్టుగా సైరన్ వినబడింది. సుబ్రహ్మణ్యం ఎదురౌతున్న ఆటోలను, రిక్షాలను, గుంపులు గుంపులుగా వస్తున్న జనాన్ని తప్పుకుంటూ తనకు కావాల్సిన అడ్రస్ గురించి వెతుకుతూనే ముందుకు కదిలిపోసాగాడు.. కొద్ది దూరం నడిచిన సుబ్రహ్మణ్యంకు పెళ్లి ఊరేగింపు ఎదురయింది.

"మేరే మన్‌కీ గంగా తేర్‌మన్‌కీ జమ్‌నా బోల్ రాధా బోలో సంగమ్" మహారాజుల్లా డ్రెస్ చేసుకున్న బ్యాండ్ మేళం ట్రూప్ శ్రావ్యంగా ట్యూన్ వాయిస్తుంటే తన్మయత్వంలో వినసాగాడు సుబ్రహ్మణ్యం.

ఇంతలో బిలబిలమంటూ తెల్లటి రూమీ టోపీలు ధరించిన ఒక గుంపు వచ్చి బ్యాండ్ మేళం ఆపాల్సిందిగా గొడవ మొదలెట్టారు. చిలికి చిలికి గాలివాన మొదలయింది.

ఇరువైపుల నుంచి రాళ్లు... రివ్ రివ్ మంటూ గాల్లోకి ఎగిరాయి.

విచ్చు కత్తులు స్వైర విహారం చేయసాగాయి.

ప్రజలంతా పరుగెట్ట సాగారు.

అంతా గందరగోళం! అరుపులు—కేకలు! హాహా కారాలు!!

సుబ్రహ్మణ్యంకు దిక్కుతోచలేదు.

తన చుట్టూ వున్న జనమంతా పిచ్చెత్తిన వాళ్లలా తన్నుకుంటున్నారు. ఒకరినొకరు పొడుచుకుంటున్నారు — నరుక్కుంటున్నారు.

సరిగ్గా అప్పుడు కనిపించింది తాను వెతుకుతున్న షాప్!

అప్పుడే షట్టర్ దించుతున్నాడు శివకోటి!

అతణ్ణి గుర్తు పట్టాడు. సుబ్రహ్మణ్యం! సుడిగాలిలా షాప్‌లో ప్రవేశించి శివకోటి కెదురుగా నిలిచాడు.

అంతటి గందరగోళంలోనూ సుబ్రహ్మణ్యం రాకను గమనించి అతగాణ్ణి ఆప్యాయంగా తన బాహువుల్లో బంధించాడు శివకోటి.

ఇంతలొక్కచిక్కణ్ణుంచో గాల్లో ఎగిరిన రాయి షాప్‌లోని గాజు సీసాకు తగిలి భళ్లున శబ్దంతో నేల రాలింది.

షట్టర్ పూర్తిగా దించేశాడు శివకోటి.

"ఏం జేస్తాం తంబీ! ఈ మతకలహాలు మామూలై పోయాయి" అన్నాడు శివకోటి.

"వీటిని నివారించే ఉపాయం ఏదైనా ఆలోచించలేదా ప్రభుత్వం" ప్రశ్నించాడు శివకోటి.

"వాళ్లు చేయగలిగినదంతా చేశారు — నీలాంటి వాడే ఏదైనా సాంబారు చెణుకు ఉపయోగించాలి."

సుబ్రహ్మణ్యం గలగల నవ్వాడు. శివకోటి అతనితో శ్రుతి కలిపాడు. సుబ్రహ్మణ్యానికి గతం గుర్తుకొచ్చింది.

అవి ఇండో—పాక్ యుద్ధం జరుగుతున్న రోజులు.

యుద్ధం ముమ్మరంగా జరుగుతోంది.

యుద్ధ రంగంలో సుబ్రహ్మణ్యం కుక్‌గా పనిచేస్తుంటే వాడు. తెల్లవారుఝామునే లేచి కంపెనీ మొత్తానికీ సరిపడా ఇడ్లీలు వడలూ తయారుచేసి తెలతెలవారుతూనే ట్రక్కులో బయలుదేరి పోరాటంలో పాల్గొంటున్న సైనికులకు అందించేవాడు. ప్రతి రోజూ క్రమం తప్పకుండా సుబ్రహ్మణ్యం అందించే నల భీమ పాకాన్ని వంటబట్టించుకున్న సైనికులు కదన రంగంలో విజృంభించి మరీ ముందుకెళ్లి పోయే వాళ్లు.

కంపెనీ అంటేమామూలు సైనికులు, ఆఫీసర్లూ కలసి నూట యాభై మంది దాకా వుండేవాళ్లు. అంత మందికీ వండి వార్చి పెట్టడం సునాయాసమైన పనేం గాదు. అయినా మన నలసుబ్ర భీమణ్యం అవలీలగా బ్రేక్‌ఫాస్ట్ లంచ్, డిన్నర్ తయారు చేసి అందరికీ అమర్చి పెడుతుండేవాడు.

యుద్ధ ఎప్పటికి ముగుస్తుందో ఎవ్వరికీ తెలియదు. ఒకానొక రోజు సుబ్రహ్మణ్యం పొద్దుటే ఇడ్లీలు తయారుచేసి కొబ్బరి చట్నీ సాంబార్‌తో సహా తెల్లవారకముందే కదన రంగానికి బయలుదేరాడు. ఇంకా సూర్యోదయం కాలేదు. ప్రత్యూష పవనాల్ని చీల్చుకుంటూ ట్రక్ యుద్ధం జరుగుతున్న ప్రదేశానికి చేరుకుంది.

కందకాల్లో నున్న సైనికుల్ని ఉద్దే

కోరమాండల్ సిమెంట్స్ లిమిటెడ్ వారి భీమ సిమెంట్

శించి బిగ్గరగా అరిచాడు సుబ్రహ్మణ్యం.

ఒరేయ్ నల్ల తంబీ — తంగవేలు — పుండరీకం అలా గోతుల్లో ఏం దాక్కుంటార్రా! మీకోసం గరమ్ గరమ్‌గా ఏం తెచ్చానో చూడండి.

కందకంలోనున్న సైనికులు ముగ్గురు సుబ్రహ్మణ్యం వైపు వచ్చారు. "అలా నిలువు ముఖాలేసుకు చూస్తారేం! దించండి" ట్రక్కులో నున్న పదార్థాల వైపు చూపిస్తూ హుకుం జారి చేశాడు సుబ్రహ్మణ్యం. సైనికులు మారు మాట్లాడకుండా అతడు చెప్పినట్టు చేశారు. మోదుగాకు దొప్పల్ని అందరికీ పంచి, ఒక్కొక్కరికి నాలుగేసి ఇడ్లీలు, సాంబారు, కొబ్బరి చట్నీ పంచేశాడు సుబ్రహ్మణ్యం.

అందరూ ఆబగా తినడం గమనించిన సుబ్రహ్మణ్యం ఒక సైనికుణ్ణి సిగరెట్ అడిగి వెలిగించుకున్నాడు.

కంపెనీలో నున్న సైనికులంతా ఒక్కొక్కరు పదేసి రెండ్లు సాంబారు తాగేశారు.

ఇంతలో సూర్యోదయమవుతున్న గుర్తుగా చీకటి రేఖలు తొలగి పోసాగాయి. సుబ్రహ్మణ్యంకు అన్నీ కొత్త ముఖాలే కనిపించ సాగాయి. యూనిఫారాల్ని చూసిన సుబ్రహ్మణ్యంకు నిలువు గుడ్లు పడ్డాయి. వాళ్లు పాకిస్తానీ సైనికులు!

బహుత్ బహుత్ షుక్రియా ఆఫీసర్‌లా కనిపిస్తున్న ఓ సైనికాధికారి సుబ్రహ్మణ్యంతో అన్నాడు సైనికులు మెచ్చుకోలుగా అతగాడి భుజాన్ని తడుతుంటే సుబ్రహ్మణ్యం పై ప్రాణాలు పైనుంచే పోయినట్లుగా ఫీలయ్యాడు.

"లంచ్‌లో ముర్గీ తెస్తావా?" చుట్టూ మూగిన సైనికుల్లో అడిగాడు వకడు. సుబ్రహ్మణ్యంకు చెమట్లు పట్టసాగాయి.

"మీరు... మీరు...." నసిగాడు.

"మేము పాకిస్తాన్ సైనికులం! మీ వాళ్లు ఇక్కడికి ఇరవై కిలోమీటర్ల దూరంలో వున్నారు."

"సార్! వీణ్ణి బందీగా పట్టుకుందామా?" ఎవరో ప్రశ్నించారు.

అయిపోయింది — తన పని ఇవాళ్టితో అయిపోయింది బెంబేలు పడిపోతూ సుబ్రహ్మణ్యం దిగాలు పడిపోయాడు. అతడి కాళ్లు వణక సాగాయి.

పాకిస్తానీ ఆఫీసర్ సన్నగా నవ్వాడు. "మనం సుబ్రహ్మణ్యం ఉప్పుతిన్నాం — అతగాణ్ణి బందీగా పట్టుకోవడం మంచిదికాదు వదిలేద్దాం."

సుబ్రహ్మణ్యానికి నమ్మకం కుదరడం లేదు.

నువ్విక వెళ్లొచ్చు — హుకుం జారీ చేశాడు సైనికాధికారి.

వణుకుతున్న కాళ్లతో ట్రక్కు చేరుకున్నాడు సుబ్రహ్మణ్యం.

అప్పటికే కాళ్ళూ చేతులు చల్లబడిన డ్రయివర్‌ను సముదాయించి ట్రక్కు స్టార్ట్ చేశాడు.

వెనుకనుంచి సైనికులు చప్పట్లు కొడుతున్నారు.

ఇడ్లీ సాంబార్ జిందాబాద్ అరిచాడొకడు.

అందరూ అతడితో శ్రుతి కలిపారు.

ట్రక్కు వేగంగా పరుగెత్త సాగింది.

తమ స్థావరానికి చేరుకున్న తరువాతనే హాయిగా ఊపిరి తీసుకున్నాడు సుబ్రహ్మణ్యం

"అవును శివకోటీ! కేవలం సాంబార్ రుచి వల్లనే ఆ రోజు ప్రాణాల్తో బయటకు రాగలిగాను."

"అలాంటిదే ఏదైనా ట్రిక్ ఆలోచించు సుబ్రహ్మణ్యం ఈ మత కలహాలతో చచ్చి పోతున్నామనుకో."

"ఏముంది శివకోటి ఆర్నెల్లపాటు భిన్నభిన్న మతాల వాళ్లు ఒకరింట్లో మరొకరు భోంచేయాలని ఆర్డినెన్స్ పాస్ చేస్తే సరి" శివకోటి నవ్వు ఆపుకోలేక పోయాడు.

"అవును ఆయా మతాల వాళ్లు ఇతర మతాల వాళ్లకు రుచికరమైన భోజనం పెట్టాలని గూడా షరతు విధించాలి." రంజీ సొల్యూషన్ చెప్పుకుపోతున్న సుబ్రహ్మణ్యం శివకోటికి ఆ క్షణంలో మహాత్ముడి మాదిరిగానే కనిపించాడు. ●

